పంట నమోదుకు రెండు రోజులే గడువు

- ప్రతి పంటా నమోదు చేసేందుకు వ్యవసాయ సిబ్బంది కృషి
- హిందూపురం వ్యవసాయ డివిజన్‌లో 95 శాతం పూర్తి



హిందూపురం మండలంలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారిణి

హిందూపురం అర్బన్: పంట సాగు ప్రయోజనాలను సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ– క్రాప్ నమోదు రైతులకు వెన్ను దన్నుగా నిలుస్తోంది. ఖరీఫ్‌లో సాగు చేసిన వివిధ రకాల పంటలను రైతు భరోసా కేంద్రంలో సిబ్బంది రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. రైతులతో బయోమెట్రిక్ వేసే ప్రక్రియ సాగుతోంది. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పంటల నమోదు చేసే ప్రక్రియ చివరి దశకు చేరింది. నమోదుకు ఇక రెండు రోజులే గడువుంది. ఈ నెల 30 వరకు మాత్రమే సమయం ఉండటంతో ప్రతి రైతూ ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

60 వేల ఎకరాలకుగాను 57 వేలు

హిందూపురం వ్యవసాయ సబ్‌డివిజన్‌లోని హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు, పరిగి, లేపాక్షి మండలాల్లో మొత్తం 60 వేల ఎకరాల్లో పంటలు రైతులు సాగు చేశారు. ఇప్పటి వరకూ 57 వేల ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు పూర్తి చేశారు. మరో రెండు రోజుల్లో రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న వ్యవసాయ సిబ్బందితో కలిసి పంట నమోదు చేయించుకొంటేనే ప్రభుత్వం నుంచి అందే ప్రయోజనాలు వారికి అందుతాయి.

అన్ని విధాలా మేలు

ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవడం వల్ల ఏ మండలంలో ఏఏ పంటలు రైతులు ఎన్ని ఎకరాల్లో సాగు చేశారన్నది తెలుస్తోంది. పంట దిగుబడులు సైతం సులువుగా అంచనా వేయవచ్చు. పంట అమ్మే సమయంలో ఈ క్రాప్ మార్కెటింగ్‌కు ఎంత గానో ఉపయోగపడనుంది.

బీమాతో ధీమా

గతంలో ప్రభుత్వ హయాంలో రైతులు సగం, ప్రభుత్వ వాటా సగం కలిపి మొత్తంగా బీమా రుసుం చెల్లించేవారు. పంటలు నష్టపోతే ప్రయోజనం అందేది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీమా మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుండటం అన్నదాతకు ఎంతో ఊరట లభించింది. ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా వారి ఖాతాల్లోకే బీమా మొత్తం డబ్బులు జమ అయ్యే విధంగా వేస్తున్న విషయం తెలిసిందే.

వందశాతం ఈ క్రాప్ నమోదు



హిందూపురం వ్యవసాయ సబ్ డివిజన్‌లో వంద శాతం ఈ క్రాప్ నమోదుకు కృషి చేస్తున్నాం. మరో రెండు రోజులే గడువు ఉంది. ఈ– క్రాప్ నమోదు చేయించుకోని, ఈ–కేవైసీ చేయని రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి వ్యవసాయ సిబ్బందితో నమోదు పూర్తి చేయించుకోవాలి. ఇప్పటికే 95 శాతం నమోదు ప్రక్రియ పూర్తయింది.

– అల్తాఫ్‌అలీఖాన్, ఏడీ, హిందూపురం

క్లుప్తంగా

పర్యాటక అభివృద్ధికి పాటుపడదాం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

పెనుకొండ: పర్యాటక అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడదామని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు పేర్కొన్నారు. పట్టణంలోని డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎన్నో పురాతన ప్రాంతాలు ఉన్నాయని అందులో పెనుకొండ ప్రాంతం ఎంతో ప్రధానమైనదన్నారు. ఈ ప్రాంత పర్యాటక అభివృద్ధికి అధికారులు, ప్రజలు, పర్యాటక ప్రియులు కృషి చేయాలన్నారు.

3న పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

మడకశిర: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అర్హులైన విద్యార్థులకు ఈఈఈ, టీటీ డిప్లమో కోర్సుల్లో చేరడానికి అక్టోబర్ 3న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శివకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు ఈకోర్సుల్లో చేరడానికి ఈనెల 30లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9492660993 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మడకశిరలో 'జనంలోకి మనం'



ర్యాలీ నిర్వహిస్తున్న తపాలా సిబ్బంది

మడకశిర: జనంలోకి మనం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో బుధవారం తపాలా సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వైఎస్సార్ సర్కిల్‌లో తపాలశాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రజలు పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని కోరారు. తపాలా ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్ నాయక్, సబ్ పోస్ట్ మాస్టర్ రమణ, సిబ్బంది నరసింహప్ప, సుదర్శన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం



తమ్మదేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అమరాపురం: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ క్రిష్ణమూర్తి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తమ్మదేపల్లిలో పంచాయతీ కార్యదర్శి మనోహర్‌శర్మ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామ వీధుల గుండా స్వచ్ఛతే సేవపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కుటుంబ సభ్యులు మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రత, తదితర వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అలాగే చేతుల శుభ్రత, ప్లాస్టిక్ కవర్ల వాడకం తదితర వాటిని వివరించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత వలన రోగాలు దూరం అవుతాయన్నారు.

దళితుల భూములను దళితులకే ఇవ్వాలి



నిరసనకారులకు సర్దిచెబుతున్న ఎస్‌ఐ, వీఆర్‌ఓ

లేపాక్షి: కుశలవ ప్రాజెక్టును రద్దు చేసి దళితుల భూములను దళితులకే ఇవ్వాలని కుల వివక్ష పోరాటా సమితి, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం మండలంలోని కొండూరులో అన్యాక్రాంతమైన భూముల్లో వారు జెండాలు నాటి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ కుశలవ ఆర్గానిక్ ప్రొడక్షన్ కంపెనీ వారు పరిశ్రమలు పెట్టి ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు ఎలాంటి పరిశ్రమ పెట్టలేదన్నారు. నిరసన విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శ్రీనివాసులు, వీఆర్‌ఓ శేషాచలం అక్కడికి వెళ్లి వారికి సర్దిచెప్పారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఘనంగా వినాయక నిమజ్జనం



నిమజ్జనానికి తరలుతున్న గణపయ్య

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట గ్రామంలో వినాయక నిమజ్జనం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగానే హిందూ మహా గణపతిని ప్రధాన వీధుల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. గణపతి బప్పా మోరియా.. జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై అంటూ భక్తులు డప్పు శబ్దాలకు డ్యాన్స్ చేస్తూ ముందుకు సాగారు. అనంతరం వినాయక ప్రతిమను మేఘలపాళ్యకుంటలో నిమజ్జనం చేశారు. గణేశ్ నిమజ్జనం సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

'గుడ్ ఎకనామిక్స్ హార్డ్ టైమ్స్' అంశంపై సర్టిఫికెట్





ఎంఐటీ యూనివర్సిటీ ఇచ్చిన సర్టిఫికెట్, నాగేంద్రబాబు

హిందూపురం: మున్సిపాలిటీలోని 24వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్, చార్టెడ్ అకౌంటెంట్ నాగేంద్రబాబు ప్రఖ్యాత యూనివర్సిటీ అయిన ఎంఐటీ బోస్టన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ నిర్వహించే ఆన్‌లైన్ కోర్సు 'గుడ్ ఎకానామిక్స్ ఫర్ హార్డ్ టైమ్స్'లో సర్టిఫికెట్ సాధించారు. ముఖ్యంగా వలస విధానం, వాణిజ్యం, ఆర్థిక అభివృద్ధి , వాతావరణ మార్పులు, ఆర్థిక సామాజిక అసమానతలు ప్రభుత్వం, నగదు బదిలీ వంటి అంశాలపై అధ్యయనం చేసినట్లు నాగేంద్రబాబు తెలిపారు. ప్రఖ్యాత యూనివర్సిటీ ద్వారా ఆర్థికశాస్త్రంలో సర్టిఫికెట్ సాధించడంతో పలువురు చార్టెడ్ అకౌంటెంట్లు, పట్టణ ప్రముఖులు నాగేంద్రబాబుకు అభినందనలు తెలిపారు.

జగనన్న మార్ట్ ద్వారా చౌకగా నిత్యావసరాలు

హిందూపురం: జగనన్న మహిళా మార్ట్ ద్వారా ప్రజలు నిత్యావసర వస్తువులను చౌకగా పొందవచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ అధ్యక్షతన బుధవారం ఆర్పీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మహిళా మార్ట్ ఏర్పాటుపై ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన



అగళిలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన



రొళ్ల: ఆవినకుంటలో కేజీబీవీ విద్యార్థుల ర్యాలీ

అగళి: మండల కేంద్రంలోని ఎంఈఓ–2 చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో అగళి బస్టాండ్‌లో బుధవారం నా భుమి – నా దేశం కార్యక్రమాన్ని కేజీబీవీ, ఆదర్శ పాఠశాల విద్యార్థులతో ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ–2 చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ దేశభక్తిని పెంపొందించేందుకే నా భుమి–నా దేశం కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సేకరించిన మట్టితో నింపిన కలశాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ దేశభక్తి గీతాలకు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. కేజీబీవీ ఎస్‌ఓ నాగరత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: మండల పరిధిలోని ఆవినకుంటలో కేజీబీవీ పాఠశాల విద్యార్థులు బుధవారం 'మేరీ మట్టి–మేరా దేశ్' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే గ్రామ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం దేశ వ్యాప్తంగా చేపట్టడం జరిగిందన్నారు. విద్యార్థులచే మట్టిని సేకరించి మండల కేంద్రానికి అందివ్వనున్నట్లు కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎస్. మున్వార్‌జాన్ తెలిపారు. ప్రతి విద్యార్థి ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

మెరుగైన వైద్యసేవలందించండి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక



రోగులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

హిందూపురం టౌన్: ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక వైద్యులు, సిబ్బందికి సూచించారు. బుధవారం రాత్రి హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రిని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ, చిన్న పిల్లల వార్డులను పరిశీలించారు. వార్డుల్లో అందుతున్న సేవలను రోగులకు అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సరిగా చూడటం లేదని రోగులు తెలపడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాస్పత్రులను ఎంతో అభివృద్ధి చేస్తూ రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలనే సంకల్పంతో కృషి చేస్తున్నారని, అందుకు అనుగుణంగా వైద్యులు, వైద్య సిబ్బంది పనితీరు ఉండాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులను క్షుణ్ణంగా పరీక్షించి వైద్య సేవలను అందించాలని సూచించారు.

పనులు త్వరగా పూర్తి చేయండి

గుడిబండ: రెండోదశ నాడు–నేడు కింద వివిధ పాఠశాలలకు మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ రవిచంద్రకుమార్ సూచించారు. బుధవారం మండలంలోని కె.కె.పాళ్యం ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు.

సౌత్‌జోన్ పోటీలకు పరిగి విద్యార్థులు

పరిగి: మండలంలోని శాసనకోటకు చెందిన నలుగురు విద్యార్థులు పెంకాక్ సిలాట్ సౌత్ జోన్ పోటీల్లో పాల్గొననున్నారని కోచ్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 29న కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో జరిగే ఏడు రాష్ట్రాల సౌత్ జోన్ పోటీల్లో శాసనకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న దివ్య, శరణ్య, మానస, డిగ్రీ విద్యార్థిని నస్రీన్ పాల్గొంటారన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఎంట్రీ ఫీజు కట్టలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కోచ్ జనార్దన్‌రెడ్డి దివ్య ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పరిగి వేణుగోపాలరావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన బుధవారం తన వంతుగా రూ.10 వేల నగదును కోచ్ జనార్దన్‌రెడ్డికి అందించారు.

మొక్కలు విరివిగా నాటాలి

రొళ్ల: ఉపాధి పథకం కింద మెట్ట ప్రాంతాల్లో పండ్ల మొక్కలు విరివిగా నాటించాలని ఏపీఓ ఓబుళప్ప పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది ఏపీఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. జాబ్‌కార్డులు కలిగిన ప్రతి కూలీకి వంద రోజుల పని దినాలు కల్పించి వలసలు నివారించాలన్నారు.

జోరుగా ఆరోగ్య సురక్ష సర్వే



పెనుకొండరూరల్: గోనిపేటలో సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సాక్షిబృందం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపటిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే జోరుగా సాగుతోంది. మడకశిర, పెనుకొండ, హిందూపురం నియోజకవర్గాల్లోని వివిధ గ్రామాల్లో బుధవారం వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం టోకెట్లు అందించి వైద్య శిబిరానికి హాజరు కావాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

హిందూపురం: జగనన్న పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నమని 30వవార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఆసీఫ్‌వుల్లా తెలిపారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక ఆదేశాలతో హస్నాబాద్‌లో వార్డు సచివాలయ కార్యదర్శులు, బూత్‌కన్వీనర్లు, గృహసారథులు, వలంటర్లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష



రొళ్ల : హెచ్‌ఎం పల్లిలో సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

రొళ్ల: అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిముర్ర పాలు తాపించడం శ్రీరామరక్షలాగా పని చేస్తుందని మడకశిర ప్రాజెక్ట్ ఐసీడీఎస్ సీడీపీఓ నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని హెచ్‌ఎం పల్లి అంగనవాడీ కేంద్రంలో జాతీయ పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిశోరి బాలికలతో పౌష్టికాహారాల పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలను నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ సన్నమ్మ, సింగిల్ విండో డైరెక్టర్ ప్రకాష్‌గౌడు, నాయకుడు ప్రసన్నకుమార్, అంగనవాడి వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి తీవ్రగాయాలు

చిలమత్తూరు: మండల పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న అక్షయ్ అనే విద్యార్థి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బుధవారం తీవ్రంగా గాయపడ్డాడు. చిలమత్తూరులోని విద్యార్థి ఇంటి సమీపంలో ఉన్న ప్రధాన రహదారిపై వదిలింది. ఇంటి వైపునకు వెళ్లే క్రమంగా గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడగా బెంగళూరుకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ

రొళ్ల: భూవివాదంలో ఇరు వర్గాలు ఘర్షణ పడగా బుధవారం పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. రత్నగిరి గొల్లహట్టి గ్రామంలో బోరన్న, గడ్డజోగప్ప, కరే బోరన్న, జోగన్నతో పాటు సిద్దలింగప్ప, రామన్న, సిద్దప్ప, శ్రీధర్ వర్గాలకు సంబంధించిన 5.68 సెంట్ల భూ వ్యవహారంలో ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డాయి. బుధవారం బోరన్న, గడ్డ జోగప్ప, కరేజోగన్న వర్గానికి చెందిన చిత్తమ్మకు, సిద్దలింగప్ప, రామన్న, సిద్దప్ప వర్గానికి చెందిన కరియన్న, యలియప్ప, మహలింగప్ప తదితరులకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని కుటుంబ సభ్యులు వైద్యం కోసం సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. వైద్యుల సూచనాల మేరకు మెరుగైన వైద్యం కోసం మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇదే విషయంపై రొళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల వారు ఫిర్యాదు చేసుకున్నట్లు సమాచారం.

లైన్‌మెన్‌గా నరసింహమూర్తి

రొళ్ల: మండల పరిధిలోని ఎం.రాయాపురం పంచాయతీ విద్యుత్‌శాఖ లైన్‌మెన్‌గా నరసింహమూర్తి బుధవారం విధుల్లోకి చేరారు. సోమందేపల్లి మండలంలో అసిస్టెంట్ లైన్‌మెన్ పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

అవినీతిపై విచారణ చేపట్టండి



రిలే దీక్షల్లో పాల్గొన్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

హిందూపురం టౌన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి వాటర్ సప్లయ్ స్కీమ్‌లో మడకశిర డివిజన్‌లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు, కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో ఆర్‌డబ్ల్యూస్‌లో పనిచేస్తున్న కార్మికులు స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయం ఎదుట సామూహిక రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. శ్రీరామిరెడ్డి వాటర్ సప్లయ్ స్కీమ్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మడకశిర డివిజన్‌లో బినామీ పేర్లతో బిల్లులు చేయించుకుంటూ రెండేళ్లుగా రూ.650 కోట్ల అవినీతిని చేశారని ఆరోపించారు. దీనిపై ఉన్నతస్థాయి అధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్మికులకు బకాయి పడ్డ జీతాలు, పీఎఫ్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి



శంకరప్ప (ఫైల్)

పరిగి: మండలంలోని మోదాకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శంకరప్ప (50) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సింగిల్ విండో అధ్యక్షుడు మారుతీరెడ్డి, ఎంపీటీసీలు నారాయణరెడ్డి, అంజి, హనుమంతు, డీలర్ మోహన్, రామాంజి, నాయకులు మంజు, మాజీ ఎంపీటీసీ అంజి, చంద్రమౌళి. జగన్నాథ్, లక్ష్మీపతి, గోపాల్, రాజు తదితరులు శంకరప్ప మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కిరికెరలో గ్రామ సంకీర్తన



గోవుకు పూజ చేస్తున్న దృశ్యం

హిందూపురం: సకల దేవతలకు నిలయమైన గోమాతను పూజిస్తే సర్వ సుఖ సౌఖ్యాలు చేకూరతాయని సద్గురు యోగినారాయణ సేవాసమితి ప్రెసిడెంట్ రవిశంకర్ అన్నారు. బుధవారం మండలంలోని కిరికెరలోని వినాయకనగర్ దొండమ్మ దేవస్థానంలో గోపూజ కైవరం తాతయ్య అభిషేక రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. భజన బృందం ఆధ్వర్యంలో గ్రామంలో గ్రామ సంకీర్తన చేశారు. అలాగే గోవులను గ్రామ వీధుల్లో ఊరేగించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు రాజప్ప, చౌడమ్మ, గంగాధరప్ప, సూర్యనారాయణరెడ్డి, రామాంజప్ప, జగదీష్, శివప్ప,రాము, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్దీకరణ పనులు చేయాలి



గగన్‌మహల్ వద్ద మైనాస్వామి

పెనుకొండ: పెనుకొండ, లేపాక్షి దేవాలయాల్లో పవిత్ర ప్రాశస్త్యం కలిగిన పురాతన దేవాలయాలు, ఇతర కట్టడాలకు విద్యుద్దీకరణతో పాటు సౌండ్ సిస్టం ఏర్పాటు చేయాలని చరిత్రకారుడు, పర్యాటక రంగ నిపుణుడు మైనాస్వామి కోరారు. బుధవారం ఆయన పట్టణంలోని పురాతన కట్టడాలు, ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెనుకొండ ఎంతో ప్రసిద్ధ ప్రాంతమని, విజయనగర రాజులతో పాటు ఎంతో మంది రాజులు ఇక్కడ పాలన సాగించారన్నారు. వారు నిర్మించిన కట్టడాలు, రాజరికపు వైభవం నేటికీ నిదర్శనంగా నిలిచాయన్నారు. అదేవిధంగా లేపాక్షి ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు.

పంట నమోదు పరిశీలన

అమరాపురం: మండలంలోని హలుకూరు, హేమావతి, మద్దనకుంట గ్రామ సచివాలయాల పరిధిలోని రైతుల పొలాల్లో బుధవారం ఈ పంట సూపర్ చెక్‌ను తహసీల్దార్ రమేష్‌బాబు, ఏఓ మంజునాథ చేపట్టారు. మూడు గ్రామాల్లో రైతుల పొలాలను పరిశీలించి వారు ఏ పంటలు సాగు చేశారు? తదితర వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ నెల 30 వరకూ పంటల నమోదుకు అవకాశం ఉందన్నారు.

పైడేటిలో జ్యోతుల ఉత్సవం



మారెమ్మ అమ్మవారి మూలవిరాట్



మారెమ్మకు జ్యోతులు మోస్తున్న మహిళలు

పరిగి: మండలంలోని పైడేటిలో బుధవారం జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన మారెమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని స్థానికులు భక్తి శ్రద్ధలతో చేపట్టారు. ఈ క్రమంలో ఉదయాన్నే మహిళలు జ్యోతులను తయారు చేసుకుని, గ్రామంలో సంప్రదాయబద్ధంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మారెమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి జ్యోతులను సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మోసగాళ్లపై చర్య తీసుకోండి

హిందూపురం టౌన్: ఎఫ్‌పీ షాపుల్లో తూకాల్లో మోసాలకు పాల్పడుతున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ, ఎరుకుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ స్వర్ణలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని ధర్మపురం, రహమత్‌పురం, లక్ష్మీపురం, కోట, బోయపేట ప్రాంతాల్లోని ఎఫ్‌పీ షాపుల్లో తప్పుడు తూకాలు వేస్తూ లబ్ధిదారులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి డీలర్ల చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎరుకుల సంఘం పరిరక్షణ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు శంకరయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, రమేష్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

చిలమత్తూరు: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో బుధవారం జరుగుతున్న బాల్య వివాహాన్ని పోలీసులు, అంగన్‌వాడీ సిబ్బంది అడ్డుకున్నారు. ఇందులో భాగంగానే బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి నోటీసులు కూడా అందజేశారు. బాల్య వివాహం చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. బాల్య వివాహాన్ని అడ్డుకున్న వారిలో జమేదార్ మోహన్‌నాయక్, మహిళా కానిస్టేబుల్ విజయలక్ష్మీ తదితరులు ఉన్నారు.